క్లుప్తంగా

జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రవీణ్



నియామకపత్రం అందుకుంటున్న ప్రవీణ్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా జీడీనెల్లూరుకు చెందిన ప్రవీణ్‌ను నియమించారు. ఆయన ఆదివారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు క్రిష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ బీసీల సంక్షేమానికి కృషి చేస్తానని ప్రవీణ్ తెలిపారు.

మినరల్ మిక్చర్, కాల్షియం కిట్ల పంపిణీ



కిట్లు అందుకున్న మహిళా పాడి రైతులు

గుడిపాల: శ్రీజ డెయిరీతోనే పాడి రైతుల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ డెయిరీ ఏరియా కో–ఆర్డినేటర్ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి శ్రీజ డెయిరీ ఆధ్వర్యంలో మహిళా పాడి రైతులకు వసంతాపురం, చిత్తపారలో మినరల్ మిక్చర్, టానిక్, పిడుదుల మందు, కాల్షియం కిట్లను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ప్రస్తుతం అన్ని డెయిరీలకన్నా తమ డెయిరీలోనే అధిక పాలరేటు ఇస్తున్నామని, దీంతో పాటు ప్రతి ఏటా బోనస్ కూడా ఇస్తున్నామన్నారు.

వర్షానికి కూలిన ఆలయ ప్రహరీ గోడ



కూలిపోయిన వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయ ప్రహరీ గోడ

బంగారుపాళెం : మండలంలో వారం రోజులుగా వర్షం కురుస్తోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయ ప్రహరీ గోడ కూలిపోయింది. ఆలయం ఎత్తులో ఉన్న కారణంగా మట్టి నాని గోడలు దెబ్బతినే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.

రికార్డులు లేని వాహనాలు స్వాధీనం



రికార్డులు లేని వాహనాలను స్వాధీనం చేస్తున్న ఐరాల పోలీసులు

ఐరాల: రికార్డులు సక్రమంగా లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు కాణిపాకం ఎస్ఐ నరసింహులు తెలిపారు. ఐరాల మండలంలోని అరుణానగర్, వినాయకపురం పరిసర ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. అనుమానితులపై ఆరా తీశామన్నారు. రికార్డులు లేని ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గుర్తుతెలియని వారు సంచరిస్తుంటే సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు.

నిండుతున్న కుంటలు



దిగువ మోదలపల్లె సమీపంలో వర్షాలకు నిండిన కొత్తకుంట

తవణంపల్లె : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతోంది. చిన్నచిన్న కుంటలు నిండిపోయి నీటితో కళకళలాడుతున్నాయి. గ్రామీణ రోడ్లు బురదమయమయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మంగళవారం 1.2 మిల్లీ మీటర్లు, బుధవారం 24.6, గురువారం 85.4, శుక్రవారం 41.4, శనివారం 14.6, ఆదివారం 10.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

నేడు పల్లెచెరువు, గోవిందరెడ్డి పల్లెలో ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: మండలంలోని పల్లెచెరువు, గోవిందరెడ్డిపల్లె గ్రామాల్లో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తామని తెలిపారు.

ప్రజా సంక్షేమం గాలికి..



క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను విడుదల చేస్తున్న విజయానందరెడ్డి, నాయకులు , హాజరైన స్థానికులు

- కూటమి ప్రభుత్వంపై చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి విమర్శ
- రెండు ప్రాంతాల్లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ'

చిత్తూరు కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ధ్వజమెత్తారు. నగరంలోని 28వ డివిజన్ వినాయకపురంలోని ఓ ఫంక్షన్ హాలులో నాయకులు మదన్, నౌషద్, 35వ డివిజన్ న్యూ కయినికట్టువీధిలో నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, కార్పొరేటర్ పుష్పలత ఆధ్వర్యంలో ఓ కల్యాణ మండపంలో ఆదివారం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ'పై సమావేశం నిర్వహించారు. తమకు అన్ని అర్హతలూ ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు అందడం లేదని పలువురు మహిళలు సమన్వయకర్త దృష్టికి తీసుకొచ్చారు. ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగించడం పరిపాటిగా మారుతోందన్నారు. సూపర్ సిక్స్ సహా దాదాపు 140 హామీలు ఇచ్చిన ఇప్పటి వరకు ఎన్ని హామీలు నెరవేర్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం ప్రవేశపెట్టి, అనేక కొర్రీలు పెట్టి, అర్హులను సైతం అనర్హులుగా చేశారని విమర్శించారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ మాట్లాడారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన, ఆడబిడ్డ నిధి, ఫ్రీ బస్సు హామీలను ఎందుకు నెరవేర్చలేదని నిలదీశారు. చంద్రబాబు పాలనలో ప్రతి కుటుంబానికీ ఎంత నష్టం జరిగిందో ప్రతి గడపకూ తీసుకెళ్తున్నామన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే ప్రజాగళం, సూపర్ సిక్స్ హామీలు, చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు చేసిన మోసం వివరాలు వస్తాయని చెప్పారు. గుడిపాల మండల పార్టీ అధ్యక్షుడు ప్రకాష్ నాయకులు హరిషరెడ్డి, కౌసర్, చల్లాముత్తు, బిందు, షానవాజ్, చంద్ర, అమూల్‌బాయ్ పాల్గొన్నారు.

ప్రమాదం జరిగేంత వరకు కార్పొరేషన్ తీరింతే..!



చిత్తూరు పూలే విగ్రహం వద్ద నేలకొరిగిన ఫ్లెక్సీ

చిత్తూరు అర్బన్: ఇవి చిత్తూరు నగరంలోని పీసీఆర్ పాఠశాల ఎదురుగా రోడ్డుకు ఇరువైపులా కట్టిన ఫ్లెక్సీలు! చిత్తూరులో ఇటీవల రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు విచ్చలవిడిగా దర్శనమిస్తున్నాయి. రాజకీయ నాయకులకు స్వాగతం పలకడం, నేతల జన్మదిన శుభాకాంక్షలు తెలియచేయడం లాంటి పనులకు కార్పొరేటర్ స్థాయి నుంచే ఫ్లెక్సీలు, భారీ కటౌట్లు పెట్టడం పరిపాటిగా మారింది. ఫ్లెక్సీలు ఎవరు పెట్టాలన్నా కార్పొరేషన్ నుంచి అనుమతి పొందాలని అధికారులు పదే పదే చెబుతున్నా.. ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. ఆదివారం నగరంలో గాలీవాన దెబ్బకు పీసీఆర్ వద్ద ఫ్లెక్సీలు నేలకొరిగాయి. అదృష్టవశాత్తు అటువైపు ఎవరూ వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది. లేకపోతే అంతంత బరువున్న ఫ్లెక్సీలు, కటౌట్లు మనుషులపై పడితే ప్రాణాలు గాల్లో కలిసిపోయేవని అక్కడి వారు చెప్పారు. ఇటీవల నగరంలో విచ్చలవిడిగా ఉన్న ఫ్లెక్సీలను చూసి కలెక్టర్ సైతం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రమాదాలకు తావివ్వకముందే అధికారులు అప్రమత్తమై ఫ్లెక్సీలపై కఠినంగా వ్యవహరించకపోతే భవిష్యత్తులో ఈ సంస్కృతి రాజకీయ పార్టీల కొట్లాటలకు, ప్రమాదాలకు నిలయంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

కమ్మతిమ్మాపల్లెలో ఘనంగా ఆడి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ



అన్నదానం చేస్తున్న గ్రామస్తులు

గుడిపాల: మండలంలోని కమ్మతిమ్మాపల్లెలో ఆదివారం ఆడి తిరునాళ్లను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గంగమ్మకు ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని అలంకరించారు. మహిళలు ఊరేగింపుగా వచ్చి అంబలి పోసి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం గ్రామస్తులు మోహన, రుక్మిణి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి అమ్మవారు ఉయ్యాల అలంకరణ, అంబూల్ అముల్‌రాజ్ డ్యాన్స్ ప్రోగ్రాం నిర్వహించారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



సింగిల్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది, తొలగించిన తీగలు

గుడిపాల: ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న తీగలు, పిచ్చిమొక్కలు, కొమ్మలను ట్రాన్స్‌కో ఏఈ శివకుమార్, లైనమెన్ మైఖేల్ నేతృత్వంలో సిబ్బంది తొలగించారు. 'ప్రమాదమని తెలిసినా..!' శీర్షికతో ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనంపై వారు స్పందించారు. అలాగే, చేతికందేంత ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లను కూడా పైకి లాగి కట్టారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్‌లో అగ్గిరవ్వలు అనే శీర్షికతో ప్రచురించిన మరో కథనంపై కూడా స్పందించారు. మరమ్మతులు చేశారు. మరో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేస్తామన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లోకేశ్వరి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. మండల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు. అదేవిధంగా కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిశీలించి పరిష్కరిస్తామని వెల్లడించారు. అదేవిధంగా మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పకహాజరుకావాలని కోరారు.

ఫసల్ బీమా యోజన పథకం గడువు పెంపు

గుడిపాల: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం గడువును ఈనెల 15 వరకు పొడిగించినట్లు వ్యవసాయాధికారి సంగీత తెలిపారు. ప్రస్తుతం వరిపంటకు సంబంధించి బీమాను రైతులు కట్టవచ్చని, రైతుసేవా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్ల ను కలిసి బీమా చేయించుకోవచ్చన్నారు. ఎకరాకు రూ. 840 ప్రీమియం కట్టాలను ఆమె తెలియజేశారు. పంట నష్టం వాటిల్లితే హెక్టారుకు రూ.42 వేలు వస్తుందని ఆమె పేర్కొన్నారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బంగారుపాళెం : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్తంగా ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. అవసరమైన వారికి చెన్నై శంకర్ నేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని వెల్లడించారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని పూజలు



కాణిపాకంలో మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌తో పాటు నాయకులు

కాణిపాకం: కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధిస్తోందని మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మండిపడ్డారు. ఆయన ఆదివారం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని కోరుతూ కాణిపాకంలో ప్రత్యేక పూజలు చేశారు. 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజల దృష్టిని మరల్చడానికి రెడ్ బుక్ పేరుతో వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణుల నుంచి సామాన్య జనం వరకు తప్పుడు కేసులు పెట్టి భయపెడుతోందని దుయ్యబట్టారు. ఇటీవల రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై కూడా అక్రమ కేసులు పెట్టించిందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాలను ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించకోక తప్పదని హెచ్చరించారు. ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని ఆ వరసిద్ధుని వేడుకున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐరాల, తవణంపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణే యూటీఎఫ్ లక్ష్యం



ఐరాలలో యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఐరాల: ఉపాధ్యాయుల హక్కులు, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే యూటీఎఫ్ లక్ష్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు తెలిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమరజీవుల ఆశయాల సాధన కోసం ప్రతి యూటీఎఫ్ కార్యకర్త కృషి చేయాలన్నారు. విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ ప్రభుత్వ వైఖరిని ఖండిస్తున్న ఏకైక సంఘం యూటీఎఫ్ అని తెలిపారు. ఇప్పటి వరకూ ఎన్నో సమస్యలపై పోరాటాలు చేసి విజయాలు సాధించామన్నారు. అనంతరం యూటీఎఫ్ జెండాను సీనియర్ నాయకులు క్రిష్ణారెడ్డి, జగన్నాథం, మోహన్, బాబు ఎగురవేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏకాంబరం, మండల గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, అసోసియేట్ అధ్యక్షుడు జనార్దన్, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, మహిళా అధ్యక్షులు అమ్ములు, రాధిక, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం అగచాట్లు!



గుడిపాలలో వరినాట్లు వేస్తున్న మహిళలు

అన్నదాతకు ఎరువులు లభించక అగచాట్లు పడుతున్నారు. రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచామని కూటమి ప్రభుత్వం చెబుతున్నా వాస్తవ పరిస్థితులు దీనికి భిన్నంగా ఉంటున్నాయి. ప్రస్తుతం మండల వ్యాప్తంగా రైతన్నలు యూరియా కోసం అవస్థలు పడుతున్నారు.

- రైతు సేవా కేంద్రాల్లో బస్తా ఉంటే ఒట్టు!
- ప్రైవేటు షాపుల్లో అధిక ధరలకు విక్రయం
- తమిళనాడుకు వెళ్లి యూరియా తెచ్చుకుంటున్న రైతన్నలు

గుడిపాల: మండలంలో చిత్తపార, బండపల్లె, పాపసముద్రం, అడవిచేను, చింతగుంటూరు, బొమ్మసముద్రం, 197రామాపురం, చీలాపల్లె, నారగల్లు తదితర గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు ప్రారంభమైంది. ఇప్పటికే 100 హెక్టార్ల పైచిలుకు వరినాట్లు వేశారు.అయితే గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా లభించక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 17 రైతు సేవా కేంద్రాల్లో ఎక్కడా యూరియా లభించలేదు. ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా ఉన్నప్పటికీ వారు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూరియా అధిక ధరలకు విక్రయించడం లేదా జింక్, గుళికలు, డీఏపీ తీసుకున్న వారికే యూరియా ఇస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. బస్తా యూరియా ధర రూ.267కు అమ్మాల్సి ఉండగా, డిమాండ్‌ను అవకాశంగా తీసుకుని రూ.300 వరకు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. మరికొంత మంది రైతులు సమీప తమిళనాడులోని కాట్పాడి, వేలూరుకు వెళ్లి యూరియా బస్తాలను అధిక మొత్తంలో తీసుకువచ్చి వరి పంటలకు వేస్తున్నారు.

ఇండెంట్ పెట్టాం



మండలంలో 10 రైతు సేవా కేంద్రాలకు ఇండెంట్ పెట్టాం. ఒక్కో కేంద్రానికి 150 బస్తాలు యూరియా వస్తుంది. వచ్చిన వెంటనే రైతులందరికీ యూరియాను పంపిణీ చేస్తాం. ప్రస్తుతం వరి పంటకు మాత్రమే యూరియాను వేసుకోవాలి. పశుగ్రాసానికి యూరియాను ఇవ్వడం లేదు. డీలర్లు యూరియాను బ్లాక్ చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

–సంగీత, వ్యవసాయాధికారి, గుడిపాల.

బాబు వైఫల్యాలు ఎండగడదాం



బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ క్యూర్ కోడ్‌లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్, పార్టీ నేతలు, హాజరైన నాయకులు, కార్యకర్తలు

- హామీలు నెరవేర్చడంలో చంద్రబాబు విఫలం
- కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించి చైతన్యవంతుల్ని చేద్దాం
- ప్రజల పక్షాన పోరాటం
- వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్

ఐరాల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారని, ప్రజలను చైతన్యవంతుల్ని చేసి బాబు వైఫల్యాలను ఎండగడదామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం కాణిపాకం వరసిద్ధి ఫంక్షన్ హాల్‌లో పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశం, బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, బాబు ష్యూరిటీకి గ్యారంటీ లేదని, అన్నీ అబద్ధపు హామీలే తప్ప ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. గ్రామగ్రామాన టీడీపీ మోసపూరిత హామీలను చాటి చెప్పాలన్నారు. గెలిచాక మేనిఫెస్టోను పక్కన పెట్టి, తమను పూర్తిగా దగా చేసిందని కూటమి ప్రభుత్వంపై ప్రజలు మండిపడుతున్నారన్నారు. జగనన్న ప్రభుత్వ హయాంలో రూ.14 లక్షల కోట్లు అప్పు చేశారంటూ అప్పట్లో ఎల్లో మీడియాతో పథకం ప్రకారం చంద్రబాబు తప్పుడు ప్రచారం చేశారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 54 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద సంవత్సరానికి రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం కింద ఇస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అన్నదాతలకు అరకొరగా ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఖజానా ఖాళీ అయ్యిందంటూ దొంగ లెక్కలు చెబుతూ ఏ ఒక్క పథకాన్నీ పూర్తిస్థాయిలో నెరవేర్చడం లేదని ధ్వజమెత్తారు. తల్లికి వందనం కింద అర్హులు 87 లక్షల మంది ఉండగా కేవలం 63 లక్షల మందికి ఇవ్వడం సిగ్గు చేటన్నారు. సూపర్‌సిక్స్ అంటూ 145 హామీలు ఇస్తూ మభ్యపెట్టి మోసగించారన్నారు. కేవలం మాయమాటలు చెబుతూ కూటమి నేతలు కాలయాపన చేస్తున్నారని నిశితంగా విమర్శించారు. పార్టీ బలోపేతానికి గ్రామాల్లో కలిసికట్టుగా పనిచేయాలన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే టీడీపీ మేనిఫెస్టో తెలిసిపోతుందన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ- మోసం గ్యారింటీ క్యూఆర్ కోడ్‌లను ఆవిష్కరించారు.

గడప గడపకు.. కూటమి వైఫల్యాలు

ఏడాదిలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది దేశంలో ఒక్క చంద్రబాబు మాత్రమే సునీల్‌కుమార్ తూర్పారబట్టారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ప్రమాదంలో పడ్డాయని, నారా లోకేష్ విరచిత 'రెడ్‌బుక్'కు సెల్యూట్ చేస్తున్న పోలీసులు చేస్తున్న అరాచకాలు, బనాయిస్తున్న తప్పుడు కేసులకు రాబోవు రోజుల్లో రెండింతలు వడ్డీతో సహా కూటమి నాయకులకు రిటర్న్ ఇస్తామని హెచ్చరించారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేక తీవ్ర నష్టాలు చవిచూస్తున్నా వారి గోడును చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోవడం లేదని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోహన్, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, కాణిపాక ఆలయ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఇవ్వాల్సిందే

బంగారుపాళెం : తోతాపురి మామిడికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఇవ్వాల్సిందేనని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వారు ఆదివారం స్థానిక మామిడి మార్కెట్ కార్యాయం వద్ద ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. నాయకులు ఆనందనాయుడు, హరిబాబు చౌదరి మాట్లాడుతూ మామిడి రైతులకు ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ప్రభుత్వం నిధులను వారి బ్యాంకు ఖాతాలకు జమచేయాలన్నారు. మామిడి రైతుల సమస్యలపై ఈ నెల 13న చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అదే విధంగా 50 వేల మంది రైతుల సంతకాలు సేకరించి ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం అందజేయనున్నట్టు తెలిపారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరిస్తామని తెలియజేశారు.